బస్తీ దవాఖానాలో ఖాళీలను భర్తీ చేయాలని వినతి

నిజాంపేట్: బడుగు బలహీన వర్గాల ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండాలని సీపీఎం నాయకులు కోరారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న రాజీవ్ గృహకల్ప బస్తీ దవాఖానాలో ఖాళీగా ఉన్న డాక్టర్, స్టాఫ్‌నర్స్ పోస్టులను భర్తీ చేయాలని సీపీఎం బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ప్రజాదర్బార్‌లో అదనపు కలెక్టర్ విజేందర్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ నిరుపేద ప్రజలకు వైద్యం అదుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో బస్తీ దవాఖానాలు నిర్మించారని, కానీ అందులో డాక్టర్, స్టాఫ్ నర్స్‌లను పర్మినెంట్‌గా కేటాయించలేదని అన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ హాస్పిటల్స్‌లో చూపించుకోవాలంటే రూ.వెయ్యి నుంచి రూ.లక్ష వరకు ఖర్చు పెట్టాల్సి వస్తోందని అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందాలంటే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేలా అధికారులు కృషి చేయాలని కోరారు. సీపీఎం నాయకులు నాగనిగ్గళ్ల బాలపీరు, పి.స్వామి, పి.భాస్కర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యోగాసన క్రీడలకు న్యాయనిర్ణేతగా పూర్ణసాయి



సుభాష్‌నగర్: సికింద్రాబాద్ తిరుమలగిరిలో ఈ నెల 19 నుంచి 23 వరకు జరగనున్న కేంద్రీయ విద్యాలయ జాతీయ యోగాసన క్రీడలకు న్యాయనిర్ణేతగా షాపూర్‌నగర్‌కు చెందిన యోగశాల కళాక్షేత్ర సహ వ్యవస్థాపకుడు పూర్ణసాయి ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా యోగా పోటీలో పాల్గొనే జాతీయ యోగాసన క్రీడలకు ఆయనను ఎంపిక చేయడంపై కుత్బుల్లాపూర్ వాసుల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



కార్యక్రమంలో కళాశాల ఫౌండర్ సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి

దుండిగల్: విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొడానికి సిద్ధంగా ఉండాలని, ముఖ్యంగా కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఎంఎల్‌ఆర్‌ఐటీఎం కళాశాల ఫౌండర్ సెక్రటరీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో సోమవారం ఓరియెంటేషన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజశేఖర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ అనుశ్రేయరెడ్డి, ట్రెజరర్ మర్రి మమతరెడ్డి, డైరెక్టర్ శ్రీధర్, ప్రిన్సిపాల్ మురళి ప్రసాద్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వకుండా వేధింపులు

నిజాంపేట్: బాచుపల్లిలోని గోకరాజు లైలావతి ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాల తమ కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తయిన విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఇవ్వకుండా వేధిస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్ బోధన ఫీజులు మొత్తం సొంతంగా పూర్తిగా చెల్లిస్తేనే ధ్రువపత్రాలు ఇస్తామని కళాశాల ప్రిన్సిపల్ సాయి హనుమాన్ తల్లిదండ్రులు, విద్యార్థులకు ఆదేశాలు ఇస్తూ, ఉద్యోగం వచ్చినా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఎంటెక్, ఎంబీఏలో చేరడానికి సమస్యగా ఉందని విద్యార్థులు మొరపెట్టుకున్నారు. కన్వీనర్ కోట కింద బీటెక్ సీట్లు పొందిన విద్యార్థులు సీటు ఎలాట్‌మెంట్ లెటర్‌లో ఎఫ్‌సెట్ ప్రవేశాల కన్వీనర్ నిర్ణయించిన ఫీజు మార్గదర్శకాలకు తూట్లు పొడుస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, రాష్ట్ర ఉన్నత విద్యామండలి, సాంకేతిక విద్యాశాఖ, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ తక్షణం స్పందించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

వర్షాలకు కూలిన గోడ



మూసాపేట: ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రం ప్రహరీ సోమవారం ఉదయం కూలిపోయింది. సుమారు 40 సంవత్సరాల క్రితం నిర్మించిన ప్రహరీ కావడంతో వర్షాలకు నానిపోయి కూలిపోయింది. నిత్యం ఆ ప్రాంతంలో స్థానికులు కూర్చుని ఉండేవారు. ఉదయం ఎవరూ లేని సమయంలో కూలడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మాజీ చైర్మన్ పి.నాగిరెడ్డి కూలిన గోడను పరిశీలించి కొత్తగా గోడ నిర్మాణం చేపట్టాలని అధికారులను కోరారు

● రోడ్లపై వరద.. రాకపోకలు ఎట్లా..?

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ ఎంఎన్‌రెడ్డి నగర్ ప్రధాన రోడ్డు మొత్తం వర్షపు నీటితో నిండిపోతోంది. అక్కడ డ్రైనేజీ పొంగి పారడంతో అటువైపుగా రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇక్కడ డ్రైనేజీకి మరమ్మతులు చేపట్టినా తిరిగి అదే ప్రాంతంలో లీకేజీ ఏర్పడటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వాటర్ వర్క్స్ అధికారులు పర్యటించి వర్షపు నీరు నిల్వకుండా కట్టడి చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ కార్యరూపం దాల్చకపోవడం విశేషం. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై నిలుస్తున్న వర్షపు నీటిని తరలించే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.





● కుప్పలుగా చెత్త.. జనంపై రోగాల పంజా

కుత్బుల్లాపూర్: ఓ చికెన్ గున్యా, డెంగీ ఫీవర్‌తో ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని పద్మనగర్ ఫేస్- 2 రింగ్ రోడ్డు సమీపంలో ఓ దేవాలయం ఎదుట 4 రోజులుగా చెత్త తొలగించకపోవడంతో ప్రధాన రహదారిపై వెళ్తున్న జనం ముక్కు మూసుకొని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. పారిశుద్ధ్య సిబ్బంది ప్రతిరోజూ చెత్తను తీసుకువచ్చి అక్కడ వేసి వెళ్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. స్థానికంగా పలువురు ఆస్పత్రుల పాలవుతున్న ఘటనలు ఉన్నా.. సంబంధిత శాఖ అధికారులు మాత్రం ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు.

● స్కూల్లో వరద.. ఇంట్లోనే విద్యార్థులు..



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ అయోధ్య నగర్ ప్రైమరీ స్కూల్ ఆవరణ మొత్తం వర్షపు నీటితో నిండిపోయింది. దీంతో విద్యార్థులు క్లాస్ రూమ్‌లోకి వెళ్లలేని పరిస్థితి. మధ్యాహ్నం వరకు వర్షం నీరు స్కూలు ఆవరణలో ఉండటంతో మధ్యాహ్నం తరగతులకు సెలవులు ప్రకటించారు. ఇక్కడ ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు క్లాసులు కొనసాగుతుండగా సుమారు 230 మంది విద్యార్థులు ఇక్కడ విద్య అభ్యసిస్తున్నారు. ప్రతి వర్షాకాలంలో ఇక్కడ ఇదే సమస్య ఎదురవుతున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏసు అధికారులను కోరారు.

ప్రజావాణిలో 18 ఫిర్యాదులు



అసిస్టెంట్ కమిషనర్ కృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: జంట సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 18 ఫిర్యాదులు వచ్చాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ కృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో 8 ఫిర్యాదులు రాగా.. ఇంజనీరింగ్ నాలుగు, శానిటేషన్, రెవెన్యూ ఒక్కొక్కటి, టౌన్ ప్లానింగ్ రెండు ఫిర్యాదులు వచ్చాయి. అదేవిధంగా గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో మొత్తం పది ఫిర్యాదులు రాగా.. ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగంపై మొత్తం ఆరు ఫిర్యాదులు వచ్చాయి. శానిటేషన్ రెండు ఎలక్ట్రిసిటీ యూబీ ఒకటి చొప్పున ఫిర్యాదులు అందాయని వాటిని సంబంధిత శాఖ అధికారులకు పంపించినట్లు పేర్కొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 11 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో భాగంగా తాగునీరు రావడం లేదని మూడు ఫిర్యాదులు, అధిక బిల్లులు వస్తున్నాయని మూడు ఫిర్యాదులు, నూతన భూగర్భ డ్రైనేజీ పైపులైన్లు వేయాలని రెండు ఫిర్యాదులు, మురుగు నీరు మ్యాన్‌హోల్ నుంచి పొంగి రోడ్లపై పారుతోందంటూ ఒక ఫిర్యాదు రాగా, బోర్‌వెల్ మరమ్మతుల కోసం ఒక ఫిర్యాదు, కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని మరో ఫిర్యాదు అందింది. ఫిర్యాదులను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని వాటర్ వర్క్స్ అధికారులు పేర్కొన్నారు. ప్రజావాణిలో డీజీఎం వికాస్, మేనేజర్లు పాల్గొన్నారు.

స్టీల్ బ్రిడ్జి నిర్మాణం కోసం ఆందోళన

సుభాష్‌నగర్ పైప్‌లైన్ రోడ్డులో ఉన్న 13 ఫీట్ల రోడ్డును 80 ఫీట్లుగా చేస్తామని హామీ ఇచ్చి రూ.56 కోట్లు మంజూరు చేసి టెండర్ పనులు పూర్తయినా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆకుల సతీష్ ఆధ్వర్యంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి నల్ల జయశంకర్ గౌడ్‌తో కలిసి కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఒకవైపు రాష్ట్ర రహదారి మరోవైపు జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డు అభివృద్ధిపై అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. పలు విభాగాల అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం కారణంగా మరోసారి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా సర్వాయి పాపన్నగౌడ్ జయంతి



సూరారం తెలుగుతల్లినగర్‌లో నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి



గాజులరామారం చౌరస్తాలో సర్దార్ పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కూన అంతయ్యగౌడ్

కుత్బుల్లాపూర్: బహుజనులకు రాజ్యాధికారాన్ని సాధించేందుకు సర్వాయి పాపన్నగౌడ్ చేసిన కృషి ఎనలేనిదని వక్తలు కొనియాడారు. సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా గౌడ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, ఫొటోలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పాపన్నగౌడ్ వీరోచిత పోరాటాలు చేశారని, మొగలు సైన్యాలను తరమికొట్టి మొదటిసారిగా గోల్కొండపై జెండా ఎగురవేశారన్నారు. ఆయన్ని స్ఫూర్తిగా తీసుకుని బహుజనుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.



భగత్‌సింగ్‌నగర్‌లో పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తూ..



రాజీవ్‌గాంధీనగర్‌లో గౌడ సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు



దుండిగల్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో..

ఉపాధ్యాయుల ప్రతిభ వెలికితీసే అద్భుత వేదిక



టీఎల్‌ఎం మేళాలో జిల్లాస్థాయికి ఎంపికైన ఉపాధ్యాయులు

చింతల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచిన విధంగానే వారి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని కుత్బుల్లాపూర్ ఎంఈఓ జెయిని కుమారి అన్నారు. షాపూర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన కుత్బుల్లాపూర్ మండలస్థాయి టీఎల్‌ఎం మేళాకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ మేళాలు ఉపాధ్యాయుల ప్రతిభను వెలికితీసే అద్భుత వేదికలు అన్నారు. మండల స్థాయిలో ప్రదర్శించిన ప్రతిభను, జిల్లాస్థాయిలోనూ రాణించేలా కృషి చేయాలన్నారు. మొత్తం 68 మంది ఉపాధ్యాయులు తమ పాఠశాలల తరఫున 198 ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఉత్తమంగా నిలిచిన 10 ఎగ్జిబిట్లను ప్రత్యేకంగా ఎంపిక చేశారు. జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించాయని పేర్కొన్నారు. వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గాంధీనగర్ హెచ్‌ఎం వెంకటరాములు, డీఆర్‌కే ప్రభాకర్‌రావు, కమల్ సింగ్, బేబీ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పురుషోత్తం, కుమారస్వామి, సుభాష్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

అనాథాశ్రమం స్థలం కబ్జా

- ఇప్పటికే పలుమార్లు కూల్చిన అధికారులు
- మళ్లీ జోరుగా కొనసాగుతున్న నిర్మాణాలు
- అధికారులు స్పందించాలంటున్న ప్రజలు

జగద్గిరిగుట్ట: అనాథాశ్రమ స్థలం అంగడిగా మారింది. జగద్గిరిగుట్ట డివిజన్ రింగ్ బస్తీలో 12 సంవత్సరాల క్రితం సుమారు 2 వేల గజాలలో అనాథాశ్రమం ఏర్పాటు చేశారు. నేడు ఆ స్థలం 80 శాతం వరకు కబ్జాకు గురైంది. మొదట్లో 5 సంవత్సరాలు సాఫీగా నడిచినా ఈ ఆశ్రమం, కొన్ని కారణాల వలన ఇక్కడి నుంచి పిల్లలను వరంగల్‌లోని శిశు సంక్షేమ సంఘానికి తరలించారు. ఇదే అదనుగా చేసుకున్న అనాథాశ్రమం ఏర్పాటు చేసిన వ్యక్తి, ప్లాట్లు చేసి విక్రయించాడు. ఈ విషయమై పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా ఇతడిపై కేసులు నమోదు చేశారు. కాగా ఇటీవల ఆ వ్యక్తి మళ్లీ గదుల నిర్మాణం మొదలు పెట్టాడు. మళ్లీ ఫిర్యాదులు రావడంతో అధికారులు కూల్చినా మళ్లీ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. కాగా ఇప్పటి వరకు ఉన్న అనాథాశ్రమ భవనాన్ని కూడా ఇటీవలే ఓ వ్యక్తికి విక్రయించగా లోలోపల నిర్మాణాలు మొదలు పెట్టాడు. ఆశ్రమం చుట్టూ నిర్మిస్తున్న గదులను ఇటీవలే రెవెన్యూ అధికారులు తూతూ మంత్రంగా కూల్చడం, తిరిగి నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఇలా ఈ అనాథాశ్రమం స్థలం పూర్తిగా కబ్జాకు గురవుతోంది. ఇప్పటికైనా అధికారులు కబ్జాదారులపై కేసులు నమోదు చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌ఐని వివరణ కోరగా ఈ స్థలంలో 58, 59 జీఓ కింద దరకాస్తు చేసుకొని డబ్బులు కట్టారని తెలిసింది. ఈ విషయమై ఆరా తీస్తున్నామని, ఈ స్థలం కబ్జాకు గురి కాకుండా ప్రయత్నిస్తున్నామని తెలిపారు.



గత వారం నిర్మాణాలు కూల్చి వేసిన రెవెన్యు అధికారులు



తిరిగి నిర్మాణం చేపట్టడానికి సిద్ధం

వసతులు కల్పించాలని వినతి

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని షిర్డీహిల్స్, బుద్ధ విహార్‌లో వసతులు కోసం స్థానికులు సోమవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు వినతి పత్రం అందజేశారు. పార్కు అభివృద్ధి, వాకింగ్ ట్రాక్, సీనియర్ సిటిజన్స్ కూర్చొనేందుకు బెంచీలు ఏర్పాటు చేయాలని విన్నవించామని, దీనికి జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలో బుద్ధ విహార్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు కాలనీవాసులు తెలిపారు.

శ్రద్ధగా చదివితే బంగారు భవిష్యత్



సుభాష్‌నగర్: దూలపల్లిలోని సెయింట్ మార్టిన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఒరియెంటేషన్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ మొదటి సంవత్సరం విద్యార్థులు అధ్యాపకులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వినాలని, చదువులపై శ్రద్ధ పెడితే భవిష్యత్‌లో ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. కార్యక్రమంలో చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌యాదవ్, డైరెక్టర్లు జైకిషన్‌యాదవ్, రాజశేఖర్‌యాదవ్, డాక్టర్ రవీంద్ర, ఫ్యాకల్టీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జల్దా వెంకటేశంకు నివాళి

రంగారెడ్డినగర్: గాంధీనగర్ పరిసర ప్రాంతాల వ్యవస్థాపకుడు, నిరుపేదల పక్షపాతి జల్దా వెంకటేశం అని వక్తలు కొనియాడారు. గాంధీనగర్‌లోని ఆయన విగ్రహానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ వెంకటేశం కృషి వల్లే ఇందిరా గాంధీనగర్, గుడెన్మెట్, గాంధీనగర్, గురుమూర్తినగర్, రంగారెడ్డినగర్, వెంకట్రామారెడ్డి నగర్ తదితర ప్రాంతాలలో వందలాది మందికి ఇంటి స్థలాలు అందినట్లు చెప్పారు. కార్యక్రమంలో జల్దా రాఘవులు, ఖాజామియా, ఎల్లయ్య, లక్ష్మీనాథ్, శ్రీనివాస్‌గౌడ్, జలీల్, భిక్షపతి, సాయికుమార్, కమలాబాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడాలని వినతి



కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న మహదేవపురం అసోసియేషన్ సభ్యులు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ మహదేవపురం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సోమవారం కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని, స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రసాద్ మాట్లాడుతూ పార్కులకు కేటాయించిన స్థలాలు, ఇతర ప్రభుత్వ స్థలాలను కబ్జా నుంచి కాపాడాలని, వాటిని గుర్తించి వెంటనే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా మహదేవపురం ప్రధాన రోడ్డు ఆక్రమణలతో ఇరుగ్గా మారిందని, వాటిని తొలగించి రోడ్డు మధ్యలో డివైడర్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. అసోసియేషన్ సంయుక్త కార్యదర్శులు రామచంద్రారెడ్డి, ప్రవీణ్‌కుమార్, కోశాధికారి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు మేలు



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాలను అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్



సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న హన్మంత్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఇటీవల అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆసిం బేగం, సునవత్ శంకర్, సునవత్ లక్ష్మణ్ నాయక్ తమను ఆదుకోవాలని కూన శ్రీశైలంగౌడ్‌ను ఆశ్రయించారు. స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.1.50 లక్షలను మంజూరు చేయించారు. సదరు మంజూరు పత్రాలను సోమవారం తన నివాసంలో లబ్ధిదారులకు అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరమని కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిజాంపేట్‌వాసులు ఎన్.సంజీవ్ కుమార్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థిక స్తోమత లేదని హన్మంత్‌రెడ్డి తెలుసుకున్నారు. తక్షణమే స్పందించి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. బాధితుడికి మంజూరైన రూ.5 లక్షల సీఎం సహాయనిధి మంజూరు పత్రాన్ని సోమవారం ఆయన అందజేశారు. మాజీ కార్పొరేటర్ పాల కృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంజీవ్‌రెడ్డి, కొలన్ రాజశేఖర్‌రెడ్డి, కొలన్ జీవన్‌రెడ్డి, రజాక్, సమీర్‌ఖాన్, అమీర్, షఫీ, శంకర్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



జగద్గిరిగుట్ట: చింతల్, గణేష్‌నగర్ నాలా వద్ద మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. ఇక్కడ ఉన్న మ్యాన్‌హోల్ గ్రిల్‌తో పాటు పక్కనే పాత మ్యాన్‌హోల్ కుంగడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నిత్యం వందలాది వాహనాలు వెళ్లే ఈ దారిలో నాలా ఎత్తులో ఉండటం కారణంగా దగ్గరకు వచ్చే వరకు కూడా ఈ మ్యాన్‌హోల్స్ కనిపించకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.